క్లుప్తంగా

ఉచిత వైద్య పరీక్షలు

పోరుమామిళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం మహిళలకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 600 మందికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. బైరెడ్డి సూర్యనారాయణ, సుశీలమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు ల్యాబ్ రామమోహన్‌రెడ్డి, తుపాకుల శ్రీనివాసులు రోగులకు చేసిన పరీక్షల రిపోర్టులు వారి వాట్సాప్ నెంబర్లకు పంపిస్తామన్నారు. శిబిరానికి వచ్చిన మహిళలకు దుర్గావాణి మహిళా సేవాసమితి సభ్యులు, సత్యసాయి సేవాసమితి, ఏకల్ అభియాన్ సమితి సభ్యులు సేవలు అందించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ

కలసపాడు : స్థానిక బస్టాండు ఆవరణలో ఆదివారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చెముడూరివీరస్వామి ఆధ్వర్యంలో ఎస్ఐ ఘనమద్దిలేటి, వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డిల చేతులమీదుగా ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు అవిశ్రాంతంగా సేవ చేస్తున్న వీరాస్వామి సేవలు అభినందనీయమన్నారు. వీరాస్వామి మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి రోజూ 300 లీటర్ల శుద్ధి నీటిని అందుబాటులో ఉంచుతానన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

బద్వేలు అర్బన్ : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల పంచాయతీలోని గాంధీకాలనీలో గల అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అంబేడ్కర్‌ను అవమానపరిచిన దోషులను కఠినంగా శిక్షించాలని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, సంఘమిత్ర జిల్లా అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు సి.నారాయణలు తెలిపారు. ఆదివారం వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానిస్తే యావత్ సమాజాన్ని అవమానించినట్లేనన్నారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణ, దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబులేసు, మాలమహానాడు నాయకులు, సీనియర్ దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి ఆకలి తీర్చడమే రంజాన్ ఉద్దేశం




ఉపవాసదీక్ష చేసిన వారికి విందు భోజనం వడ్డిస్తున్న విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల : రంజాన్ మాసం సందర్భంగా పోరుమామిళ్లలో ఉన్న నాలుగు మసీదుల్లో ఆదివారం నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని రుఖియా మసీదులో ఆయన నమాజులో పాల్గొని ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవి, మండల కోఆప్షన్ మెంబర్ అల్లా, మాజీ సర్పంచులు భూతప్ప, బాలగురివిరెడ్డి, గంగనపల్లె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కాశినాయన మాజీ జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

పులివెందుల రూరల్ : మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తెలిపారు. పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి వాహనాలను నడుపుతున్న మైనర్లను పట్టుకుని సీజ్ చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ లేకుండా నడపడం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడంవలన నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పైపుల ధ్వంసం



నీటి పైపును కోసేసిన గుర్తు తెలియని వ్యక్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ రెడ్డి తోటలోని నీటి పైపులను గుర్తుతెలియని వ్యక్తులు కోసేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన పొలంలోని పంటకు నీరు అందించడానికి ఏర్పాటు చేసిన పైపులైన్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో కోసేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో పంటలకు నీరు అందించే పైపులను ఇలా కోసివేయడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నాడు.

కొత్త పింఛన్లకు పడిగాపులు

- పనిచేయని పింఛన్ల నమోదు సర్వర్
- ఎన్నికలు పూర్తయి 9 నెలలైనా పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం
- పింఛన్ల కోసం ఎన్ని నెలలు వేచి ఉండాలంటూ అర్హుల ఆవేదన

నరసాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వృద్ధుడికి ఎనిమిది నెలల క్రితమే 60 సంవత్సరాలు వయస్సు నిండింది. పింఛన్‌కు అర్హత వచ్చింది కదా అని దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే ఇంకా సర్వర్ రాలేదని అన్నారని వాపోయాడు.

ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన పుల్లమ్మ భర్త ఏడు నెలల క్రితమే చనిపోవడంతో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వలేదు. మళ్లీ రావాలని చెప్పారంటూ కన్నీటిపర్యంతమైంది.

ఎస్టీకాలనీకి చెందిన హనుమంతు కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సచివాలయానికి వెళితే ఇంకా అనుమతులు రాలేదు, దరఖాస్తులు తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నాడు.

ఇదీ ప్రస్తుత కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి మనోవేదన.



కొండ్రాజుపల్లె సచివాలయం

కాశినాయన: గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో పింఛన్లు, కొత్తరేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకుండా చేసింది. కొత్త పింఛన్ల నమోదుకు సంబంధించిన వెబ్‌సైట్ పనిచేయడం లేదు. ఇంకెప్పుడు మేము పింఛన్లు తీసుకుంటామో అర్థం కావడం లేదంటూ అర్హులు చెబుతున్నారు. కొత్త పింఛన్ దరఖాస్తు చేసుకునే క్రమంలో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని వారు చెబుతున్నారు. అంతేకాకుండా కొత్తగా వివాహం అయిన వారు కొత్త రేషన్‌కార్డు పెట్టుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్ చేస్తుందా అని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్

ఏప్రిల్ 18 నుండి ఎన్నికల నోటిఫికేషన్ అమలులోకి రావడంలో ఆగిన పింఛన్ల నమోదు వెబ్‌సైట్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఏమిటని ప్రజలు సచివాలయాలకు వెళ్లి నిలదీస్తున్నారు. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ తీసుకునేందుకు 60 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగత్వ నిర్ధారణ ధృవీకరణపత్రం పొందిన దివ్యాంగులు, భర్త చనిపోయిన వితంతువులు కొత్త పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే కొత్తగా రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడు అనుమతి ఇస్తుందా అని కొత్త రేషన్‌కార్డుదారులు కూడా పడిగాపులు కాస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి ధృవపత్రాలు తీసుకుని అర్హులైన వారిని గుర్తించి వలంటీర్లే దరఖాస్తులు చేసేవారు. అలాగే కొత్త రేషన్ కార్డులకు వలంటీర్లే సచివాలయంలో దరఖాస్తులను అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంత వరకు పాత పింఛన్ల పంపిణీ తప్ప మరే ఇతర సంక్షేమం అందించే ఊసే లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు.

ఆదేశాలు రావాలి

కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి ప్రభుత్వం నుండి ఎటువంటి సమాచారం లేదు. అనుమతులు వచ్చిన తర్వాత దరఖాస్తులను స్వీకరిస్తాం. అంతవరకు సంయమనం పాటించాలి. పింఛన్ల అర్హులు సచివాలయ సిబ్బందికి సహకరించాలి.

- మైథిలి, ఎంపీడీఓ, కాశినాయన మండలం

సమాజసేవలో యువత ముందుండాలి

బద్వేలు అర్బన్ : సమాజసేవలో యువత ముందుండాలని ఎక్సైజ్ సీఐ బి.సీతారామిరెడ్డి, ఆర్టీసీ డీఎం ఆర్.సి.నిరంజన్‌లు తెలిపారు. విప్లవవీరులు భగత్ సింగ, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు చెట్లు ఎంతగానో దోహదపడతాయని, ఇందుకోసం ప్రతిఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కోరారు. డీవైఎఫ్ఐ యువజన సంఘం యువత, ప్రజా సమస్యలపై పోరాడుతూనే సామాజిక బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పోరాటపటిమను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకుని



బస్టాండు ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, డీవైఎఫ్ఐ నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, జిల్లా మహిళా కన్వీనర్ గురుదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, పట్టణ నాయకులు, మహిళా సంఘం నాయకురాలు అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

ప్రొద్దుటూరు డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన హెచ్చరించారు. ప్రొద్దుటూరు మండలంలోని అమృతా నగర్‌లో పోలీసులు ఆదివారం కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించారు. డీఎస్పీతో పాటు సీఐలు ఎస్ఐలు, సిబ్బంది అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా నెంబర్ ప్లేట్లు, డాక్యుమెంట్లు లేని 25 బైక్‌లు మూడు ఆటోలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం కూడలిలో డీఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్‌తో ఎందరో జీవితాలు నాశనమవుతున్నాయని చెప్పారు. గంజాయి విక్రయించడం ఎంతటి నేరమో.. తీసుకోవడం కూడా అంతే నేరమని డీఎస్పీ



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ భావన

అన్నారు. పేకాట, మట్కా, జూదం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. మహిళలపై దాడి చేసినా, వేధించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు బాలమద్దిలేటి, రామకృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, ఎస్ఐలు మహ్మద్‌రఫి, సురేష్, సంజీవరెడ్డి, యోగీంద్ర, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబార్కేషన్ పాయింట్‌ను రద్దు చేయడం దుర్మార్గం

వేంపల్లె : పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లే విజయవాడ ఎంబార్గేషన్ పాయింట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో పవిత్ర హజ్‌యాత్ర చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హజ్ యాత్రీకులు హైదరాబాద్, బెంగళూరుల నుండి వెళ్లేవారని అయితే అప్పటి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్లే హజ్ యాత్రికుల సౌకర్యార్థం కోసం ఎంబార్కేషన్ పాయింట్ రాష్ట్ర నడిబొడ్డున ఉన్న విజయవాడ కేంద్రంగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరడం జరిగిందన్నారు. ఆయన ఆదేశానుసారం డిప్యూటీ సీఎం, హజ్ కమిటీ చైర్మన్ అప్పటి కేంద్ర ఏవీషియన్ మంత్రి స్మృతి ఇరానీకి పలుమార్లు కలవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంవల్ల విజయవాడకు పాయింట్ ఇవ్వడం జరిగిందన్నారు. 2022 వరకు కరోనా ఉన్న కారణంగా హజ్‌యాత్ర రద్దు చేశారన్నారు. అయితే 2023లో విజయవాడలో హజ్ హౌస్ లేకపోయినా కూడా గుంటూరు వద్ద ఉన్న నంబూరు మదరసాలో సకల ఏర్పాట్లు భోజన వసతి, తాత్కాలిక ఏసీలు ఏర్పాటు చేసి దాదాపు రూ.14 కోట్లు వెచ్చించి హజ్ యాత్రకు వెళ్లే 2,800 మంది హాజీలను ఎటువంటి లోటు లేకుండా విజయవాడ నుండి హజ్‌యాత్రకు పంపడం జరిగిందన్నారు. అలాగే హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేలు సబ్సిడీ ఇచ్చిందన్నారు. 2024 సంవత్సరంలో కూడా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి పంపడం జరిగిందన్నారు. అయితే ఆ సంవత్సరం ఎన్నికల కోడ్ వల్ల యాత్రికులకు రావాల్సిన సబ్సిడీ అమౌంట్ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు పది మాసాలైనా ఇప్పటివరకు హజ్ యాత్రికులకు సబ్సిడీ డబ్బు ఇవ్వలేదని విమర్శించారు. ముస్లింలు పట్ల కూటమి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ముస్లింలకు తోడుగా అండగా నిలిచే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు.

ఆ ఇన్విజిలేటర్ల తీరు.. ప్రైవేటుకు లబ్ధి

ముద్దనూరు : పదవ తరగతి పరీక్షల్లో కొంతమంది ఇన్విజిలేటర్లు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ముద్దనూరులో రెండు కేంద్రాల్లో పది పరీక్షలు జరగుతున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులై ఇన్విజిలేటర్లుగా నియమితులైన వారు ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు లబ్ధి చేకూరేలా వారు వుండటంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, తల్లితండ్రులు వారి తీరుపై ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ ఆ ఇన్విజిలేటర్లు ఓ ప్రైవేటు పాఠశాలలో కనిపిస్తున్నారన్నారు. ఇది అనుమానాస్పదంగా వుందని ప్రభుత్వ విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పట్ల పది పరీక్షలో ఆ ఇన్విజిలేటర్లు తీరు వివాదంగా మారకముందే విద్యాశాఖాధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

పోరుమామిళ్ల : రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన పోరుమామిళ్లలో మాట్లాడుతూ రైతు పంటలకు కనీస మద్దతు ధర లభించడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అన్నదాత దుఃఖీభవ పథకంగా తయారైందన్నారు. రూ.10706 కోట్లు అవసరం కాగా రూ.6300 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు.

ప్రతి రైతు ఖాతాలో రూ.40000 వేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు తెరచి మద్దతు ధరతో పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ డాక్టర్ అన్వర్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తులసిరెడ్డి

పెద్దమ్మ, చిన్నమ్మ దేవర ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి



అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని కోట వీధిలో వెలసిన పెద్దమ్మ, చిన్నమ్మ దేవర ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి పెద్దమ్మ, చిన్నమ్మ వార్ల విగ్రహాలను తయారుచేసి మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి ఇంటి వద్ద కొలువుదీర్చారు. పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవార్లను దర్శించుకున్నారు. చల్లను సమర్పించి కోళ్లు, మేకలు, పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో సందడి నెలకొంది. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెద్దమ్మతల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి



బోనాలతో మహిళలు

మైదుకూరు : మైదుకూరులో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి జాతరను వైభంగా నిర్వహించారు. మూడు రోజులుగా కోలాహలంగా జరుగుతున్న జాతర మూడో రోజు కన్నుల పండుగగా సాగింది. ఆదివారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో పెద్దమ్మతల్లి, చిన్నమ్మ తల్లి, గాలిదేవరలను తప్పెట్లు బాణసంచాతో.. పెద్దమ్మ తల్లికి జై అంటూ భక్తులు హర్షధ్వానాల మధ్య గద్దెపై నిలిపారు. అనంతరం పాత ఊరు చుట్టూ పొలి చల్లారు. మూడో రోజు కూడా భక్తులు చల్ల పోశారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు బోనాలను తీసుకుని వచ్చి మొక్కుబడులను చెల్లించుకున్నారు. పలువురు మహిళలు పొర్లుదండాలు పెట్టారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న పెద్దమ్మ తల్లి మూలవిరాట్‌ను దర్శించుకుని భక్తి పారవశ్యంతో పూజలు నిర్వహించారు. తమ మొక్కులను ఇంటి వద్ద నుండి తప్పెట్లతో తీసుకొచ్చి అమ్మవారికి చెల్లించుకున్నారు. ధన, కనక వస్తువులను కానుకలుగా సమర్పించుకున్నారు. పలువురు చీరెసారెలను అమ్మవారి పాదాల చెంత ఉంచారు. స్థానికుల ఇళ్లకు వచ్చిన బంధుమిత్రులతో పెద్దమ్మ తల్లి ప్రాంగణమంతా కళకళలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ హాసం ఆధ్వర్యంలో ఏఎస్ఐ శివప్రసాద్ రెడ్డి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రాత్రి పెద్దమ్మ తల్లి, చిన్నమ్మ తల్లి, గాలిదేవరలను పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు దివిటీలను చేతపట్టి పెద్దమ్మ తల్లి గద్దె వద్ద నుంచి ఊరేగింపుగా స్థానిక బద్వేలు రోడ్డులోని పొలిమేర గట్టుకు చేర్చారు.

పోలేరమ్మకు బోనాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రూపరాంపేటలోని పోలేరమ్మ ఆలయంలో జాతర సందర్భంగా ఆదివారం నిర్వహించిన బోనాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పోలేరమ్మతల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో విరసిల్లాలని కోరుతూ పోలేరమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ ఆవరణలో బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

పోలేరమ్మ, అంకాలమ్మ జాతర

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల రెడ్డినగర్‌లో వెలసిన శ్రీ పోలేరమ్మ, అంకాలమ్మ గ్రామదేవతల జాతర ఆదివారం రెండవ రోజు వైభవంగా జరిగింది. రాఘవేంద్రనగర్‌కు చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి సి. మూర్తెయ్య, విశ్రాంత ఆర్మీ జవాన్ ఆర్.శ్రీనివాసులు, ఉపసర్పంచ్ నగేంద్ర ప్రసాద్‌ల ఆధ్వర్యంలో మహిళలు, యువకులు భారీగా బోనాలు, కోడిపుంజులు, మేకపోతులు పట్టుకుని గ్రామదేవతల వద్దకు తప్పెట్లతో, చిందులతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపునకు ముందు ప్రతి ఇంటి ముందు మహిళలు బిందెలతో నీళ్లు పోశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద గిరినగర్‌కు చెందిన ఊరేగింపు వచ్చి కలిసింది. రెండు వీధుల భక్తులు తప్పెట్లతో గ్రామదేవతల వద్దకు సంయుక్తంగా వెళ్లారు. పూనకాలు వచ్చిన మహిళలు ఊగిపోయారు. ఊరేగింపు గ్రామదేవతల సన్నిధికి చేరగానే అమ్మవార్లకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.



ఊరేగింపుగా పోతున్న భక్తులు

30న పల్లవోలులో బండలాగుడు పోటీలు

చాపాడు : ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని పల్లవోలు గ్రామంలోని అంకాలమ్మ దేవస్థానం వద్ద బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఆదివారం మధ్యాహ్నం 1గంట నుంచి పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.1,00,116లు, రూ.80,116లు, రూ.60,116లు, రూ.40,116లు, రూ.20,116లు చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. అంకాలమ్మ సన్నిధిలో ఉగాది వేడుకలకు హాజరయ్యే ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

రామాలయంలో వేడుకలు

పోరుమామిళ్ల : మండలంలోని కవలకుంట్లలో నిర్మించిన రామాలయంలో ప్రతిష్ట జరిగి మండలం పూర్తైన సందర్భంగా గ్రామస్తులు వేడుకలు భారీగా నిర్వహించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఆర్‌డీ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు సీతారామిరెడ్డి, వీరయ్య, వెంకటసుబ్బయ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బుకీలకు కౌన్సిలింగ్

ప్రొద్దుటూరు క్రైం: క్రికెట్ బుకీలకు వన్ టౌన్ పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రికెట్ బుకీలను స్టేషన్‌కు పిలిపించి సీఐ రామకృష్ణారెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని, మ్యాచ్‌లు ఉన్న సమయంలో అందరూ స్టేషన్‌కు రావాలని హెచ్చరించారు. సమాజానికి పట్టి పీడిస్తున్న బెట్టింగ్‌ను విడనాడాలని సీఐ సూచించారు.